యూపీ బీజేపీలో అసమ్మతి

- సీఎం యోగి - డిప్యూటీ సీఎం మౌర్య మధ్య విభేదాలు
- కొనసాగుతున్న లోక్‌సభ ఎన్నికల ఫలితాల చిచ్చు
- రాజీనామాకు సిద్ధపడ్డ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు
- ఉప ఎన్నికల రూపంలో త్వరలో మరో సవాల్

లక్నో, జూలై 17: లోక్‌సభ ఫలితాలు ఇచ్చిన షాక్ నుంచి ఉత్తరప్రదేశ్ బీజేపీ బయటపడటం లేదు. ఇంతకాలం ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాటే శాసనంగా నడిచిన ఆ పార్టీలో ఇప్పుడు అసంతృప్త గళాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా యోగి ఆదిత్యనాథ్‌కు ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్యకు మధ్య విభేదాలు తీవ్రమయ్యాయనే ప్రచారం జరుగుతుంది. ఇటీవలి పరిణామాలు ఈ ప్రచారానికి బలం చేకూరుస్తున్నాయి. ఒకవైపు లోక్‌సభ ఎన్నికల్లో వ్యతిరేక ఫలితాలకు బాధ్యత వహిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి భూపేంద్ర చౌదరి రాజీనామా చేయాలని నిర్ణయించారు. ఇదిలా ఉండగా త్వరలో యూపీలో 10 అసెంబ్లీ స్థానాలకు జరగనున్న ఉప ఎన్నికలు బీజేపీకి మరో సవాల్‌గా మారాయి.

సీఎం వర్సెస్ డిప్యూటీ సీఎం

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య మధ్య విభేదాలు మొదలయ్యాయి. గత నెల రోజులుగా మంత్రులతో యోగి నిర్వహించిన సమావేశాలకు మౌర్య హాజరుకావడం లేదు. ఇటీవల జరిగిన పార్టీ సమావేశంలో మౌర్య మాట్లాడుతూ.. 'పార్టీ కంటే ఎవరూ పెద్ద కాదు. ప్రభుత్వం కూడా పార్టీ కంటే ఎక్కువ కాదు' అని చేసిన వ్యాఖ్యలు యోగిని ఉద్దేశించినవే అనే భావన నెలకొన్నది. మరోవైపు యూపీలో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సీట్లు 62 నుంచి 33కు తగ్గిపోవడం పట్ల బీజేపీ నేతలు వ్యక్తిగత సంభాషణల్లో యోగి వైఖరినే నిందిస్తున్నారు. ఆయన పాలనా తీరు వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపిస్తున్నారు. యోగీ మాత్రం అతివిశ్వాసం వల్లే తక్కువ సీట్లు వచ్చాయని పేర్కొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాజీనామా

లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో పార్టీకి వచ్చిన వ్యతిరేక ఫలితాలకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు భూపేంద్ర చౌదరి నిర్ణయించారు. యూపీ వ్యవహారాలు బీజేపీ హైకమాండ్‌కు కూడా తలనొప్పిగా మారాయి. దీంతో యోగి, మౌర్య, భూపేంద్రతో నరేంద్ర మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వరుస సమావేశాలు నిర్వహించారు. బీజేపీలో ఈ పరిస్థితిపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ స్పందిస్తూ... అంతర్గత కలహాలతో బీజేపీ మునిగిపోతున్నదని పేర్కొన్నారు.

కన్నడనాట 'లోకల్' రచ్చ!

- ప్రైవేటు ఉద్యోగాల్లో స్థానికులకు రిజర్వేషన్
- బిల్లుకు కర్ణాటక మంత్రిమండలి ఆమోదం
- సర్కారు నిర్ణయంపై పారిశ్రామికవేత్తల ఫైర్
- రాష్ట్రం నుంచి కంపెనీలు పోతాయ్: నాస్కామ్
- కంపెనీలకు ఆహ్వానం పలికిన ఏపీ, కేరళ
- విమర్శలతో వెనక్కు తగ్గిన కాంగ్రెస్ ప్రభుత్వం
- లోకల్ బిల్లును నిలిపివేస్తున్నట్టు ప్రకటన

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ): ఐటీ, ఐటీఈఎస్, పరిశ్రమలు, కర్మాగారాలు ఇలా అన్ని రకాల ప్రైవేటు సంస్థల్లోని ఉద్యోగాల్లో స్థానికులకు రిజర్వేషన్లు కల్పించాలంటూ కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం తీవ్ర కలకలం రేపుతున్నది. సిద్ధరామయ్య సర్కారు నిర్ణయాన్ని ఐటీ ఇండస్ట్రీ సమాఖ్య నాస్కామ్ సహా పలువురు వ్యాపారవేత్తలు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో లోకల్ బిల్లుపై యూటర్న్ తీసుకుంది. బిల్లును నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది.

ఏమిటీ నిర్ణయం?

కర్ణాటకలోని అన్ని ప్రైవేటు కంపెనీల్లోని ఉద్యోగాల్లో స్థానికులకే 100 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు వీలు కల్పించే బిల్లుకు సోమవారం రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు సీఎం సిద్ధరామయ్య సోమవారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పరిశ్రమల్లో సీ, డీ గ్రేడ్ పోస్టులకు సంబంధించి 100 శాతం కన్నడిగులనే నియమించేలా వీలు కల్పించే బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది' అని సీఎం పేర్కొన్నారు.

అయితే, ఈ నిర్ణయంపై పారిశ్రామిక వర్గాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమయ్యింది. ఈ క్రమంలో తన పోస్ట్‌ను తొలగించిన సిద్ధరామయ్య.. 'ప్రైవేటు సంస్థల్లో నాన్ మేనేజ్‌మెంట్ పోస్టుల్లో 70 శాతం, మేనేజ్‌మెంట్ పోస్టుల్లో 50 శాతం పోస్టులను మాత్రమే కన్నడిగులకు కేటాయించాల'ని తాము నిర్ణయించినట్టు వెల్లడించారు. కర్ణాటకలో పుట్టినవారు, 15 ఏండ్లుగా రాష్ట్రంలో నివసిస్తున్నవారిని స్థానికులుగా గుర్తిస్తారు. కన్నడ భాషలో మాట్లాడుతూ, రాయగలిగినప్పటికీ సెకండరీ స్కూల్ సర్టిఫికెట్ గనుక లేకపోతే.. రాష్ట్ర నోడల్ ఏజెన్సీ నిర్వహించే అర్హత పరీక్షలో నెగ్గినవారిని స్థానిక అభ్యర్థిగా పరిగణించనున్నట్టు బిల్లులో పేర్కొన్నారు.

భగ్గుమన్న పారిశ్రామికవేత్తలు

కర్ణాటక ప్రభుత్వ తాజా నిర్ణయంపై పారిశ్రామికవేత్తలు మండిపడ్డారు. ఇలాంటి అసంబద్ధ నిర్ణయాలతో రాష్ట్రం నుంచి కంపెనీలు మరోచోటుకు తరలివెళ్లిపోతాయని, కొత్తగా వచ్చే పెట్టుబడులకు కూడా ఈ నిర్ణయం అడ్డంకిగా మారుతుందని ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ విమర్శించారు. ఇలాంటి ఫాసిస్ట్ నిర్ణయాలు తీసుకోవడం కంటే స్థానిక యువత నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు దృష్టిసారిస్తే ప్రయోజనం ఉంటుందని ప్రభుత్వానికి చురకలు అంటించారు. అధిక నైపుణ్యం ఉన్న సిబ్బంది నియామకాల విషయంలో ఈ బిల్లు నుంచి మినహాయింపునివ్వాలని, లేకపోతే కష్టమని బయోకాన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా అభిప్రాయపడ్డారు.

కంపెనీలకు ఏపీ, కేరళ ఆహ్వానం

కర్ణాటక ప్రభుత్వం తీసుకువచ్చిన లోకల్ బిల్లుతో అసంతృప్తిగా ఉన్న కంపెనీలను ఆంధ్రప్రదేశ్, కేరళ ఆహ్వానించాయి. విశాఖలో కంపెనీలు ఏర్పాటు చేయాలని ఏపీ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' ద్వారా ఆహ్వానించారు. మరోవైపు కేరళ పరిశ్రమల శాఖ మంత్రి పీ రాజీవ్ సైతం 'కేరళ కాలింగ్' హ్యాష్‌ట్యాగ్‌తో పరిశ్రమలను తమ రాష్ట్రానికి రావాల్సిందిగా ఆహ్వానం పలికారు.

ఇంకా రూపకల్పన దశలోనే బిల్లు: సిద్ధరామయ్య

లోకల్ బిల్లుపై వ్యతిరేకత రావడంతో ఈ బిల్లు ఇంకా రూపకల్పన దశలోనే ఉందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. ఈ బిల్లుపై వచ్చే క్యాబినెట్ సమావేశంలో సమగ్రంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని 'ఎక్స్' ద్వారా వెల్లడించారు.

అసంతృప్తితో ఉన్నాం

కర్ణాటక సర్కారు తీసుకొన్న నిర్ణయంపై మేము తీవ్ర ఆందోళనతో, అసంతృప్తితో ఉన్నాం. ఇలాంటి నిబంధనలతో కంపెనీలు వేరే ప్రాంతాలకు తరలివెళ్లే ప్రమాదమున్నది. స్థానికంగా తగిన నైపుణ్యాలున్న వాళ్లు లభించనప్పుడు కంపెనీలకు తరలివెళ్లడం తప్ప, వేరే మార్గం కనిపించబోదు. -నాస్కామ్

'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్'

అవసరం లేదు

బెంగాల్ బీజేపీ నేత సువేందు అధికారి వ్యాఖ్య

కోల్‌కతా, జూలై 17: ప్రధాని మోదీ ఇచ్చిన 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ నినాదం'పై బెంగాల్ బీజేపీ నేత సువేందు అధికారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇక బెంగాల్‌లో ఆ నినాదం అవసరం లేదని అన్నారు. మైనారిటీ వర్గం మద్దతు ఇవ్వకపోవడం వల్లే ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ఓడిందని సువేందు అధికారి పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ అవసరం లేదని, దాని స్థానంలో హమ్ ఉన్‌కే సాథ్ జో హమారీ సాథ్ (మాతో ఉన్న వారితో మేమున్నాం) పెట్టాలని సూచించారు.

కొత్త క్రిమినల్ చట్టాలపై మమత ప్రభుత్వం సమీక్ష

కోల్‌కతా: ముఖ్యమంత్రి మమత బెనర్జీ నేతృత్వంలోని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన మూడు కొత్త క్రిమినల్ చట్టాలను సమీక్షించేందుకు ఏడుగురు సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. మూడు నెలల్లోగా ఈ కమిటీ నివేదికను సమర్పించవలసి ఉంటుంది. ఈ మేరకు మంగళవారం నోటిఫికేషన్ జారీ అయ్యింది. కాగా, ఈ కమిటీ లక్ష్యాలేమిటో వివరించాలని మమత బెనర్జీని గవర్నర్ సీవీ ఆనంద బోస్ కోరారు.

కూలీ ఉద్యోగాలకు పోటెత్తిన యువత

ముంబై ఎయిర్‌పోర్టుకు 25 వేల మంది.. దేశంలో నిరుద్యోగ తీవ్రతకు దర్పణం

ముంబై, జూలై 17: దేశంలో నిరుద్యోగ తీవ్రత ఏ స్థాయిలో ఉందో చాటే సంఘటన ముంబై ఎయిర్‌పోర్టులో జరిగింది. ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల లగేజీని లోడింగ్, అన్‌లోడింగ్ చేయడం కోసం లోడర్ ఉద్యోగాలు, ఎయిర్‌పోర్టులో నిర్వహణ పనుల కోసం హెల్పర్ ఉద్యోగాల భర్తీకి ఎయిర్ ఇండియా ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ ప్రకటన జారీ చేసింది. జీతం రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు మంగళవారం ముంబై ఎయిర్‌పోర్టు వద్ద ఉన్న తమ కార్యాలయానికి రావాలని పిలిచింది. దీంతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువకులు వేలాదిగా ఎయిర్‌పోర్టు వద్దకు పోటెత్తారు. దాదాపు 25 వేల మంది యువకులు అప్లికేషన్‌లు, సర్టిఫికెట్లు పట్టుకొని చేరుకున్నారు. గంటల తరబడి అభ్యర్థులు నీళ్లు, ఆహారం లేకుండా నిరీక్షించాల్సి వచ్చింది. చివరకు దరఖాస్తులు ఇచ్చేసి వెళ్లాలని సంస్థ ప్రకటించింది.

నిన్న గుజరాత్‌లో.. నేడు మహారాష్ట్రలో..

ఇటీవల గుజరాత్‌లోని భరూచ్ జిల్లాలోనూ 10 ఉద్యోగాల కోసం దాదాపు 1,800 మంది అభ్యర్థులు తరలిరావడంతో తోపులాట జరిగిన సంఘటన తెలిసిందే. ఈ ఘటనలు జరిగిన రెండు రాష్ట్రాల్లోనూ ఎన్డీఏ ప్రభుత్వాలే ఉండటం గమనార్హం.

మాల్‌లోకి రైతుకు నో ఎంట్రీ

పంచె ధరించిన ఓ రైతుకు బెంగళూరులో అవమానం జరిగింది. కుమారుడితో కలిసి మంగళవారం స్థానిక జీటీ మాల్‌లో సినిమా చూసేందుకు వెళ్లగా.. సెక్యూరిటీ ఆయన్ను నిలిపేశారు. ప్యాంట్ వేసుకోవాలని పట్టుబట్టారు. దీనిపై సామాజిక మధ్యమాల్లో నెటిజన్లు తీవ్ర విమర్శలు చేశారు.

న్యాయం కోసం రైతు పార్లు దండాలు!

శాంతిలాల్ పాటీదార్.. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ వృద్ధ రైతు. తన భూమిని ల్యాండ్ మాఫియా ఆక్రమించిందని, తన భూమి తనకు ఇప్పించాలని అనేక సార్లు అధికారులకు ఫిర్యాదులు పెట్టుకొన్నాడు. ఆ రైతు మొరను ఏ అధికారీ పట్టించుకొన్న పాపాన పోలేదు. ఇక చేసేదేం లేక ఇలా ఏకంగా కలెక్టర్ ఆఫీస్‌లో ఫ్లోర్‌పై పార్లు దండాలు పెడుతూ.. 'నా భూమిని అక్రమార్కుల నుంచి విడిపించండి మహాప్రభో' అని వేడుకొన్నాడు. మధ్యప్రదేశ్‌లోని మాందసౌర్ జిల్లా కలెక్టరేట్‌లో తాజాగా జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

రాజస్థాన్‌లో మాస్ కాపీయింగ్

ప్రశ్నలకు బోర్డుపై సమాధానాలు రాసిన టీచర్లు

జైపూర్: రాజస్థాన్ స్టేట్ ఓపెన్ స్కూల్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కోలు గ్రామంలో ఓ ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో ఓపెన్ స్కూల్ 10, 12 తరగతుల పరీక్షలు జరుగుతున్నాయి. ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల కోసం ఇక్కడికి వచ్చింది. పాఠశాల గేట్లకు తాళాలు వేసి ఉన్నాయి. దీంతో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది గోడలవైకి ఎక్కి, గదుల్లోకి ప్రవేశించారు. పరీక్షా పత్రంలోని ప్రశ్నలకు జవాబులను ఉపాధ్యాయులు బ్లాక్ బోర్డ్‌పై రాస్తున్నట్లు, దానిని చూసి విద్యార్థులు జవాబు పత్రాల్లో రాస్తున్నట్లు గుర్తించారు. కొందరు విద్యార్థులకు బదులుగా టీచర్లే పరీక్షలు రాస్తున్నట్లు గమనించారు. అంతేకాకుండా, ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.2,000 చొప్పున ఉపాధ్యాయులు వసూలు చేస్తున్నట్లు విద్యార్థులు చెప్పారు.



ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ ఇంటిపైకి బుల్డోజర్

పుణె, జూలై 17: వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ అధికారి పూజా ఖేద్కర్ ఇంటి బయట అక్రమ నిర్మాణాన్ని పుణె మున్సిపల్ అధికారులు బుధవారం బుల్డోజర్‌తో కూల్చివేశారు. ఇంటిబయట ఉన్న పుట్‌పాత్‌ను ఆక్రమించి అక్రమంగా కట్టిన నిర్మాణాన్ని తొలగించాలని గతంలో నోటీసులు జారీ చేసిన అధికారులు దానిపై స్పందించకపోవడంతో కూల్చివేశారు. ఇలాఉండగా, తనను వేధించారంటూ పుణె కలెక్టర్‌పై పూజా ఫిర్యాదు చేసిన క్రమంలో ఆమె స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు హాజరు కావాలంటూ పుణె పోలీసులు ఆమెకు నోటీసులు జారీచేశారు. ఇప్పటికే ఓబీసీ, దివ్యాంగుల కోటాను దుర్వినియోగం చేసినట్టు ఆమెపై ఆరోపణలు రావడంతో ఐఏఎస్ ట్రైనీ శిక్షణను నిలిపివేసిన సంగతి తెలిసిందే.

ప్రపంచ రాజకీయాల్లో భారతీయ నారీశక్తి

- యూకే, అమెరికా, న్యూజిలాండ్, కెనడా వంటి దేశాల్లో చట్టసభలకు ఎన్నిక
- అమెరికా రాజకీయాల్లో కీలకంగా మారిన కమలా హారిస్, ఉషా చిలుకూరి
- యూకే పార్లమెంటులో 15 మంది
- బ్రిటన్ ప్రతిపక్ష నేతగా ప్రీతి పటేల్?

కమలా హారిస్

ఉషా చిలుకూరి

ప్రీతి పటేల్

శివాని రాజా

హైదరాబాద్, జూలై 17: ప్రపంచ రాజకీయ యవనికపై నేడు భారతీయ మూలాలు కలిగిన మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఒకవైపు భారత్‌లో చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కోసం ఇంకా ఎదురుచూస్తున్న మహిళలు విదేశీ రాజకీయాల్లో మాత్రం సత్తా చాటి తమను తాము నిరూపించుకుంటున్నారు. అమెరికా, యూకే, కెనడా, న్యూజిలాండ్, ఇలా అనేక దేశాల్లో భారతీయ మూలాలు కలిగిన మహిళలు ప్రజల మన్ననలు పొంది చట్టసభల్లో అడుగుపెడుతున్నారు. అమెరికాలో జరుగుతున్న ఎన్నికల్లో భారతీయ మూలాలు కలిగిన ఇద్దరు మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారు. మరోవైపు బ్రిటన్‌లో ప్రతిపక్ష నాయకురాలిగానూ ఓ బ్రిటీష్ ఇండియన్ ఎన్నికయ్యే అవకాశం ఉంది. ఇలా వివిధ దేశాల్లో వేర్వేరు వృత్తులతో పాటు రాజకీయాల్లోనూ భారతీయ మూలాలు కలిగిన స్త్రీలు తమదైన ముద్ర వేస్తున్నారు.

బ్రిటన్ పార్లమెంటులో 15 మంది భారతీయ మహిళలు

ఒకనాడు భారత్‌ను పాలించిన బ్రిటన్ రాజకీయాల్లో నేడు భారతీయ మూలాలు ఉన్న మహిళలు కీలకంగా మారారు. ఇటీవల జరిగిన యూకే సాధారణ ఎన్నికల్లో 26 మంది బ్రిటీష్ ఇండియన్లు పార్లమెంటుకు ఎన్నికవగా వీరిలో 15 మంది మహిళలే కావడం విశేషం. గతంలో బ్రిటన్ హోం సెక్రటరీగా పని చేసిన ప్రీతి పటేల్ ఈసారి ప్రతిపక్ష నేత అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి. ప్రీతి పటేల్ పూర్వీకులు గుజరాత్ నుంచి వలస వెళ్లారు. ఇక, 29 ఏండ్లకే యూకే పార్లమెంటులో అడుగుపెట్టిన శివానీ రాజా సంచలనం సృష్టించారు. ఆమె తల్లిదండ్రులు కూడా గుజరాత్‌కు చెందిన వారు. ఆమె భగవద్గీత మీద ప్రమాణం చేయడం ఇటీవల వార్తల్లో నిలిచింది. ఇక, లేబర్ పార్టీ నుంచి రెండోసారి ఎంపీగా గెలిచిన నదియా విట్టోమ్ కూడా బ్రిటన్ రాజకీయాల్లో కీలకంగా మారారు. 2019 ఎన్నికల్లో ఆమె 23 ఏండ్ల వయస్సులోనే మొదటిసారి పార్లమెంటుకు ఎన్నికై అతి పిన్న వయస్కురాలైన ఎంపీగా చరిత్రకెక్కారు. నదియా తండ్రి పంజాబీ కాగా, తల్లి ఆంగ్లో-ఇండియన్.

కెనడాలో మహిళా మంత్రులుగా..

కెనడా రాజకీయాల్లోనూ భారతీయ మూలాలు కలిగిన మహిళా నేతలు కీలకంగా వ్యవహరిస్తున్నారు. 2021లో జరిగిన కెనడా పార్లమెంటు ఎన్నికల్లో 17 మంది భారత మూలాలు ఉన్న వారు గెలవగా, వీరిలో ఆరుగురు మహిళలే. వీరిలో అనిత ఇందిరా ఆనంద్ కెనడా ట్రెజరీ బోర్డుకు అధ్యక్షురాలిగా కీలక పదవిని నిర్వహిస్తున్నారు. గతంలో ఆమె మంత్రిగానూ పని చేశారు. మరో ఎంపీ కమల్ ఖేరా ప్రస్తుతం కెనడా మంత్రిగా ఉన్నారు. ఆమె పూర్వీకులు ఢిల్లీకి చెందిన వారు. మరో మహిళా ఎంపీ బర్దీశ్ ఛగ్గర్ కూడా మంత్రిగా పని చేశారు.

ఇతర దేశాల్లోనూ..

అమెరికా, కెనడా, యూకే మాత్రమే కాకుండా ఇతర దేశాల్లోనూ భారతీయ మహిళలు రాజకీయంగా రాణిస్తున్నారు. న్యూజిలాండ్‌లో ప్రియాంక రాధాకృష్ణన్ ఎంపీగా ఎన్నికయ్యారు. 2020 నుంచి 2023 వరకు ఆమె మంత్రిగానూ పని చేశారు. ఆస్ట్రేలియా, సింగపూర్ తదితర దేశాల్లోనూ భారతీయ మూలాలు కలిగిన మహిళలు రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు.

అమెరికాలో హారిస్, ఉషా వాన్స్

అమెరికా ఎన్నికల్లో ఇద్దరు భారతీయ మూలాలు కలిగిన మహిళలు కీలకంగా మారారు. డెమొక్రెటిక్ పార్టీ తరపున మరోసారి ఉపాధ్యక్ష పదవికి కమలా హారిస్ పోటీ పడుతున్నారు. రిపబ్లికన్ పార్టీ తరపున ఈ పదవికి తెలుగు దంపతుల కూతురు ఉషా చిలుకూరి భర్త జేడీ వాన్స్ పోటీ చేస్తున్నారు. తన భర్త గెలుపు కోసం ఉషా తనవంతు సహకారం అందిస్తున్నారు. కాగా, కమలా హారిస్ ఇప్పటికే అమెరికా ఉపాధ్యక్ష పదవిని చేపట్టిన మొదటి మహిళగా, మొదటి బ్లాక్ అమెరికన్‌గా, మొదటి దక్షిణాసియా వ్యక్తిగా రికార్డు సృష్టించారు. మరోవైపు అమెరికా రాజకీయాల్లో నిక్కీ హేలీ కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆమె తల్లిదండ్రులు పంజాబ్ నుంచి వలసవెళ్లారు. ఆమె రిపబ్లికన్ పార్టీ తరపున అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీ పడి ఓడిపోయారు.

ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర!

కొద్ది వారాల క్రితమే

అమెరికాకు నిఘా సమాచారం

వాషింగ్టన్, జూలై 17: అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర పన్నిందనే నిఘా సమాచారం అమెరికాకు కొన్ని వారాల క్రితమే వచ్చిందని అంతర్జాతీయ మీడియా సంస్థ సీఎన్ఎన్ వెల్లడించింది. అధ్యక్ష ఎన్నికల ప్రచారం నేపథ్యంలో ట్రంప్‌నకు ముప్పు పొంచివున్నదని సీక్రెట్ సర్వీస్ వెల్లడించిందని ఓ అధికారి పేర్కొన్నట్టు తెలిపింది. అయితే దీనిపై స్పందించేందుకు వైట్‌హౌస్ నిరాకరించింది. గత వారం ట్రంప్‌పై హత్యాయత్నం చేసిన వ్యక్తికి స్వదేశీ, విదేశీ సహచరులు లేరని పేర్కొన్నది. ట్రంప్ హత్యకు కుట్ర పన్నినట్టు వస్తున్న ఆరోపణలను ఇరాన్ ఖండించింది. ట్రంప్‌పై దాడికి తమకు ఎలాంటి సంబంధం లేదని ఆ దేశ ప్రతినిధి నస్సీర్ కనాని తెలిపారు. జనరల్ సులేమాని హత్యలో పాత్రకు సంబంధించి ట్రంప్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొనేందుకు తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నదని పేర్కొన్నారు.

పాట బాగుంటే శృంగారం!.. లేదంటే మరణమే!

- ప్రపంచంలోనే ప్రమాదకరమైన ఆడ కప్పలను కనుగొన్న శాస్త్రవేత్తలు
- మగ కప్పలతో శృంగారం కోసం సింగింగ్ కాంపిటీషన్ నిర్వహణ
- గెలిస్తే, సయ్యాట.. లేకుంటే మృత్యుక్రీడ
- ఆస్ట్రేలియా అడవుల్లో గుర్తింపు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ): అదో కప్ప జాతి. ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరానికి ఉత్తరంగా ఉండే కూరగాంగ్ ద్వీపంలోని అడవుల్లో నివసిస్తాయి. ఈ జాతిలోని ఆడ కప్పలు ఆకుపచ్చ రంగులో, మగ కప్పలు బంగారు వర్ణంలో మెరిసిపోతూ ఉంటాయి. మగ కప్పలతో పోలిస్తే, ఆడ కప్పలు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తాయి. అయితే, బయటకు అంత అందంగా కనిపించే ఆ ఆడ కప్పల దినచర్య మాత్రం భయానకంగా ఉంటుంది. అందుకే, ఆ కప్పలను ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర మైనవిగా యూనివర్సిటీ ఆఫ్ న్యూక్యాజిల్ పరిశోధకులు అభివర్ణిస్తున్నారు.

ఎందుకు ప్రమాదకరమంటే?

తమ సంతానోత్పత్తిని వృద్ధి చేసుకోవడంలో భాగంగా ఆడ కప్పలు.. మగ కప్పల జత కోసం వెదుకులాట మొదలుపెడతాయి. తమకు తగ్గ జోడీని ఎంచుకోవడానికి మగ కప్పలకు సింగింగ్ కాంపిటీషన్‌ను నిర్వహిస్తాయి. తమకు నచ్చేవిధంగా మగ కప్పలు గీతాలాపన చేస్తే, మెచ్చి శృంగారంలో పాల్గొంటాయి. మగ కప్ప గొంతు నచ్చకపోతే, అప్పటికప్పుడే దాన్ని నోటితో నమిలి అమాంతం మింగేస్తాయి. ఈ మేరకు పరిశోధనకు నేతృత్వం వహించిన శాస్త్రవేత్త జాన్ గౌడ్ 'న్యూయార్క్ టైమ్స్'తో పేర్కొన్నారు.

ఎలా కనిపెట్టారంటే?

కూరగాంగ్ ద్వీపంలోని అడవుల్లో మాత్రమే కనిపించే ఈ అరుదైన కప్ప జాతిలో ఆడ కప్పల సంతతి ఎక్కువగా ఉన్నప్పటికీ, మగ కప్పల జనాభా క్రమంగా తగ్గిపోతుండటంతో శాస్త్రవేత్తలు ఈ దిశగా పరిశోధనలు చేపట్టారు. కొద్ది రోజుల పాటు ఈ కప్పలజాతిపై నిఘా వేశారు. ఈ క్రమంలోనే ఈ విషయం బయటపడింది. కాగా మగ కప్పల కంటే ఆడకప్పల శరీరం, నోరు పెద్దగా ఉండటంతోనే అవి అమాంతం మగ కప్పలను నోటితో మింగేస్తున్నాయని జాన్ గౌడ్ వెల్లడించారు. మగ కప్పలు సాధారణంగా 2 అంగుళాల వరకు పెరిగితే, ఆడ కప్పలు 2.75 అంగుళాల నుంచి 3 అంగుళాల వరకూ పెరుగుతాయని వివరించారు.

కొవిడ్ సోకిన పిల్లల్లో వేగంగా డయాబెటిస్ లక్షణాలు

న్యూఢిల్లీ, జూలై 17: పిల్లల్లోగానీ, పెద్దల్లోగానీ టైప్-1 డయాబెటిస్ లక్షణాలు అంత త్వరగా బయటపడవు. అయితే కొవిడ్ సోకిన పిల్లల్లో టైప్1 డయాబెటిస్ లక్షణాలు వేగంగా బయటపడతాయని తాజా అధ్యయనం వెల్లడించింది. 'అమెరికన్ మెడికల్ అసోసియేషన్' జర్నల్ నివేదిక ప్రకారం.. విపరీతమైన దాహం, తరుచూ మూత్ర విసర్జన, నిద్రలేమి, వంటివి టైప్-1 డయాబెటిస్‌లో ప్రధాన లక్షణాలు. పిల్లల్లో, పెద్దల్లో ఈ లక్షణాలు చాలా ఆలస్యంగా బయటపడతాయి. కొవిడ్-19 బారినపడ్డ పిల్లల్లో మాత్రం.. ఆటోఇమ్యూన్ డిజార్డర్‌తో టైప్-1 డయాబెటిస్‌ను వెంటనే గుర్తించవచ్చునని పరిశోధకులు చెబుతున్నారు. ఇది 'రోగ నిరోధక వ్యవస్థ' ప్యాంక్రియాస్‌పైనా దాడి చేసి దెబ్బ కొడుతుంది. రక్త పరీక్షతో ఇన్సులిన్ కణాల తీరును పరిశీలించి టైప్-1 డయాబెటిస్‌ను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చునని అధ్యయనం వివరించింది.

భారత్‌లో ఫేక్ ఈ-చలాన్ స్కామ్

న్యూఢిల్లీ, జూలై 17: వాట్సాప్‌ల్లో ఫేక్ ఈ-చలాన్లు పంపుతూ వియత్నాం హ్యాకర్లు పెద్ద ఎత్తున ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారు. హ్యాకర్ల దాడితో.. భారత్‌లోని 4,400 మొబైల్ ఫోన్లకు మాల్‌వేర్ సోకిందని, మోసపూరిత ఆర్థిక లావాదేవీలతో హ్యాకర్లు రూ.16 లక్షలు కొల్లగొట్టారని ప్రముఖ సైబర్ సెక్యూరిటీ సంస్థ 'క్లౌడ్‌సెక్' తాజాగా వెల్లడించింది. తొలుత హ్యాకర్లు వాట్సాప్ ద్వారా ఫేక్-ట్రాఫిక్ చలాన్ నోటీసుల్ని పంపుతారు. వాటిపై క్లిక్ చేయగానే యూజర్ల మొబైల్ ఫోన్లలోకి మాల్‌వేర్ ప్రవేశిస్తుంది. దీంతో ఓటీపీ నెంబర్లు సహా అంతా హ్యాకర్లకు తెలిసిపోతున్నది. ఈ-కామర్స్ సైట్లలోకి వెళ్లి మోసపూరిత ఆర్థిక లావాదేవీలకు హ్యాకర్లు పాల్పడ్డారని 'క్లౌడ్‌సెక్' తెలిపింది.